# దోసకాయ పప్పు

"పప్పు(ర్రా పప్పు. హాట్ హాట్ పప్పు. కొత్తిమెర, కరివేపాకుల్తో ఘుమఘుమలాడే పప్పు. దోసకాయ పప్పు. ఎవరికీ, ఎవరికీ నీకే పెద్దదానా!"

" దోసకాయ పప్పా అమ్మా! .. వేస్తావా!... ఏమిటో.. ఇస్స్!".... " అదేమిటే, గోడకతుక్కు పోయావేమిటి! పప్పు చూస్తే నీరసం వచ్చేసిందా?".. " ఏం చెప్పనే అమ్మా. పీత బాధ పీతది! నాబాధ నాది! పైవాళ్లు అర్చేదా తీర్చేదా! ఆ దోసగింజ చూడగానే నాకు కాసేపు క్వార్ట్జ్ వాచీ జ్ఞాపకమొచ్చేస్తోంది. రోజూ మా ఫ్రెండు కాలేజీకి పెట్టుకొస్తుందే అమ్మా!... సెంటర్ సెకండ్, పాయింటెడ్ హాండ్స్, రేడియం డయలూ, రోమన్ డిజిట్సూ, డే అండ్ డేటూ, స్టీలు ఫ్రేమున్నూ! చెయిన్ కూడా కత్తిలాంటిస్టీల్దేనే! ఇంపోర్టెడ్‌ది. ఎంత బాగుంటుందో వాచీ!.... ముష్టి వెయ్యిపెట్టి ఒక్కటి, ఒక్కటంటే ఒక్కటి - ఈ సంక్రాంతికి కొనుక్కోలేకపోతున్నానుగదా! ఎందుకే నాకీ బతుకు అమ్మా!"

" ఆఁ , ఏం సూకరాలే నాతల్లి! వెయ్యిరూపాయలు ముష్టివైపోయాయా! ఇంతోటి కాలేజీ చదువునాటికే ఇహ వాచీ అమరదనే వైరాగ్యం వచ్చేసిందా!... పోనీ ఓ పని చెయ్యి... ఓ అయిదునెల్లు తిండి మానెయ్! కొనుక్కోవచ్చు!... ఇంతకీ పప్పు వెయ్యనా?"

" ఫోవే, మనసిప్పి నీతో ఏం చెప్పుకున్నా శాపనార్థాలే!... ఏదో దోసగింజ. చూడగానే జ్ఞాపకం వచ్చిందిగదాని చెప్పాను గానీ.. ఊఁ... ఊఁ... ఇంత పుట్టెడు దుఃఖంలో నా మొహానికి పప్పొకటికూడానా!' .... " వెయ్యాలో వద్దో చెప్పుముందర... తర్వాత తీరిగ్గా మొదట్నించీ ఏడుద్దుగానీ!... వాచీట వాచీ?"

★ ★ ★

" నీకే చిన్నదానా, పప్పు!"... " ఆగాగు. ఆగవే! ... మరీ అమ్మా... దోసగింజ షేపులో ప్లాస్టిక్ బుట్ట అల్లితే ఎట్లా ఉంటుందే? బుట్టకి కింద చువ్వల ఫ్రేముకూడా ఉంటే ఇంకా స్ట్రాంగ్‌గా ఉంటుంది కదూ? మంచి ఫ్రేమొకటి కొనుక్కోవాలి డబ్బివ్వవే."

" నాన్నగారి నడుగు నాదగ్గరెక్కడుంది!... పప్పు కావాలా వద్దా?".... " అసలమ్మా, నా కెప్పట్నుంచో ఆ షేపంటే ఇష్టమే... మర్చిపోయానేవ్! అల్లికల్లో క్లాసులో నాకు ఫస్టు ప్రైజొచ్చింది తెల్సా! దోసగింజ షేపులోనే డిజైను అల్లాను.".... " ఫస్టు ప్రైజా, సంతోషం!"

" అందుకే నా నోట్సులన్నీ అంచులు కట్ చేసి దోసగింజ షేపులోకి తెచ్చేసుకున్నాను. పోస్టుకార్డును కూడా ఆ షేపుకు కట్ చేసి మొన్న పోస్టులో పంపించానే అమ్మా దీపావళి గ్రీటింగ్స్ సేఫ్ గా వెళ్ళిపోయింది, పీర్లపాడు. మాఫ్రెండు ఒకటే కంగ్రాట్స్ అనుకో!" ... " మంచి పని చేసావ్... త్రిభుజాకారంగా కూడా కట్ చెయ్యి. చదువూ బాగా వస్తుంది. కాంగ్రాట్సూ వస్తాయి. ట్రంకాల్స్‌లో!... ఇప్పుడు పప్పు మాటేమిటి?"... "అవునేవ్, త్రిభుజాకారంగానూ, మధ్య ఖాళీతో కంకణం ఆకారంగా - అంటే చిల్లుకానీ ఆకారంగానూ కూడా కట్ చెయ్యొచ్చుగదే! నాకింతవరకూ తట్టనేలేదు చూసావా! ఎంత తెలివిగలవాళ్ళకైనా ఒక్కోసారి ఇటువంటివి తట్టవనుకుంటాను"..." ఆఁ,ఆఁ, నన్నుకూడా కట్ చెయ్యొచ్చు.. నీ తెలివి మండిపోను!"

★ ★ ★

" ఏ పెద్దాడా, దోసకాయ పప్పురా!.. నీ కిష్టమని చేసాను." .. " గింజలు తియ్యకుండానే పప్పు చేసేసావా! అయ్యయ్యో, ఎంత పనిచేసావమ్మా! దోసగింజలు ఎంత పవిత్రమైనవో నీకు తెలీదా?

సృష్టమ్మా, సృష్టి! అండపిండ బ్రహ్మాండావృతమైన ఈ సృష్టిలో గోళాలూ, గ్రహాలు. అన్నీ ఒకదానిచుట్టూ ఒకటి గిరగిరా గిరగిరా గిరగిరా తిరుగుతున్నాయంటే ఆ తిరిగే మార్గాలు- అనగా ఆర్బిట్లు - అన్నీ ఇంచుమించు ఈ దోసగింజ షేపులోనే ఉంటాయమ్మా. అట్లా కోపంగా చూస్తావేంటి, ఒట్టునిజం! ఎందుకంటే ఈ మహత్తర సత్యాన్ని కనుక్కొంది నేనుకాదు కెప్లర్! ఆ మార్గాల్ని ఎలిప్సులు- అంటే దీర్ఘవృత్తాలు - అంటారు... ఒరే శిష్యా, దీర్ఘ వృత్తానికి ఎన్ని కేంద్రాలా? మాట్టాడు జిడ్డు వెదవ! తెడుషేపు బుర్రెప్పుడూ ఆలోచిస్తూనే ఉంటుంది! పోన్లేవే అమ్మా, ఆ యాతనేదో నేనే పడతాన్లే!"

" తెలుగు డిగ్రీదాన్ని . ఈ సోది నా కెందుకురా! నీ లెక్కల పాండిత్యం నాకేమర్ధమవుతుంది? .. పప్పు మాట చెప్పు. వెయ్యనా వద్దా!" .. " ఆగవే, నీదొహ పిచ్చిగోల !. ఏం, రెడీయేనా, అంతా వినండి! .. దీర్ఘవృత్తానికి రెండు కేంద్రాలు అరటావు కాగితం మీద అయిదంగుళాల దూరంలో రెండు గుండుసూదులు నిటారుగా గట్టిగా గుచ్చు. ఏం, ఎనిమిదంగుళాలు దారం తీసుకొని దాని కొసలు ఈ సూదులికి కట్టు. దారం లూజుగా ఉంటుంది కదా! పెన్సిలు ములుకు కాగితం మీద ఆనేట్టు చూసుకుంటూ ఆ ములుకుతోనే దారాన్ని సాగదీయి. ములుకు దగ్గర కోణం ఏర్పడుతుంది కదా! ఆ దారాన్ని ములుకుతో అట్లా కోణంలా లాగిపట్టిఉంచుతూనే ఆ ములుకుని కాగితం మీద ఎడమకీ కుడికీ కదుపుతూ కాగితం మీద గీత గియ్యి. అదే దీర్ఘవృత్తం! అసలు టైకో బ్రాహే అన్నవాడు గ్రహాలన్నీ పరిపూర్ణ లక్షణాలు కలిగి ఉన్నాయనీ, అవన్నీ సూర్యుడి చుట్టూ వృత్తాకారాల్లో తిరుగుతుంటాయనే అన్నాడు. అంగారక గ్రహాన్నిపరిశోధించి పరిశోధించి ఆ వాదనంతా శుద్ధ తప్పని నిరూపించాడు కెప్లర్ చాలా గ్రహాలు ఇంచుమించు ఈ దీర్ఘవృత్తాలమార్గాల్లో తిరుగుటుంటాయన్నాడు. అనంత విశ్వంలోంచి ఎక్కడ్నుంచో దూసుకువచ్చి సౌరకుటుంబంలో ప్రవేశించి మళ్ళిపోయే గోళాలు పరావలయ మార్గాల్లో - అంటే ఇంచుమించుఅర్ధ దీర్ఘవృత్త మార్గాల్లో- ప్రయాణిస్తాయని కూడా చెప్పాడు కెప్లర్... అసలు ఆరు అంశాలు క్షుణ్ణంగా పరిశీలిస్తేనేగాని ఒక గ్రహాన్ని గురించి పూర్తిగా గ్రహించినట్టు కాదుట!.. అన్నట్టు చంద్రుడిలో ఉన్న లేడిపిల్లమచ్చ ఉందే అది మచ్చకాదేవ్! రాజమండ్రిలో ఉన్నప్పుడు కాలేజీ టెలిస్కోపులోంచి చూసానే అమ్మా! అక్కడి లోయలూ, పర్వతాలూ, బిలాలూ భలే కనిపించాయ్ నాకు. ఆ బిలాలే మనకు మచ్చలాగా కనిపిస్తాయన్నమాట!. అసలింతకీ దీర్ఘవృత్తం తాలూకు ఈ కేంద్రాల్ని కేంద్రాలనరు, ఈ దీర్ఘవృత్తం వృత్తమూకాదూ! దీని లక్షణాలే వేరు, వృత్తం లక్షణాలే వేరు! హాఁ హాఁహాఁ హాం.."

" ఈ గిన్నె కిందపెట్టి ముందరిప్పుడు ఆ దీర్ఘవృత్తం గియ్యమంటావా నన్ను, లేకపోతే ఒక్కసారి సూర్యుడి చుట్టూ ఓ రౌండు తిరిగి రమ్మంటావా? . నీ లెక్కలు చెక్కలయిపోను! పప్పు కావాలో వద్దో చెప్పమంటే ప్రాణం తీస్తున్నావు కదారా!"

* * *

" నువ్వురా చిన్నాడా, ఏ మూడ్‌లో ఉన్నావు?". " ఊఁ".. " పప్పు!". " ఊఁ".. " వెయ్యనా వద్దా?" ... " ఏం పప్పు, దోసపప్పుకదూ! . ఆలోచిస్తున్నా, ఆలోచిస్తున్నా!.. దోసదోస... ఆఁ ఒచ్చిందే, ఒచ్చిందే! ."

" ఎప్పుడూ నీకిదొకరోగం ! తిండి మధ్యలో వస్తూంటుంది!" " అబ్బబ్బ ఇంత శ్రేష్ఠ సుత్తి అయిపోయావేమే నువ్వీ మధ్య... పద్యమే. దోసమీద అమోఘమైన పద్యం! చెప్పనా.. 'దోసమటం చెరింగియును దుందుడుకొప్పగ పెంచినారమీ మీసము..' ఆహాఁ కవిత్వమంటే తిరపతి వెంకటేశ్వర కవుల్దే కదే కవిత్వం అమ్మా! ద్రాక్షాపాకం! అన్నట్టు ఇంకో పద్యం ఉందేవ్ అసలు సిసలు దోసకాయ మీద పద్యం! ' వేసవిని పప్పు చలువయు కోసుక తినివేయువచ్చు కోరిక కల్గన్ భేషుగ పులుసులో

నిముతును దోసల అవన్ని తినని దొరయో దొరయా?!"... ఎందుకే అట్లా కోపంగా చూస్తావ్! గజేంద్రమోక్షం పద్యానికి పేరడీ చెప్పానటా? అది నా సొంతమేం కాదు. ఎవరో కవీశ్వరుడిది. అసలు ... ఈ సంక్రాంతి శుభ సందర్భంలో నేనూ ఒకటి చెప్పేస్తే ఎట్లా ఉంటుందంటావ్? చిన్నదేనే, అచ్చంగా దోసమీదే కూడా! ఆశుపద్యం ... ఊఁ... ఊఁ..."

"నా కళ్ళు మండిందో చెప్పనెత్తిన దొర్లించిపోతా!"... "ఆగాగు, ఖంగారుపడకు! అన్ని దానాల్లోకీ ప్రధానమైంది నిదానం! చాదస్తం వదిలెయ్!... వస్తోంది... కంద ... కంద... కంద . కందపద్యం . అఁ - వేసవిని పప్పు చలువయు- కోసుక తినివేయ వచ్చు ఉట్టిగ పండున్- అయ్యయ్యో పాయె, పాయె యతి పాయె! కోసుక తినివేయవచ్చు ఉట్టిగ పండున్ - హద్ది కథ.. ఏం! భేసుగ్గా పులుసులో ఇముడును- దోసల అవయిన లేని తావొక తావా... ఛ,ఛ బాగా పడలా! . దోసల అవయినలేని తిండొక తిండా!.. వెరీగుడ్, వచ్చేసింది! అంతా వినండొహోయ్!

'వేసవిని పప్పుచలువయు కోసుకతినివేయవచ్చు ఉట్టిగ పండున్ భేషుగ పులుసులో ఇముడును దోసల అవయిన లేని తిండొక తిండా!' ఒరే అన్నయ్యా, అక్కా చప్పట్లుకొట్టండర్రా! ... నేనే ఇంటి పెద్దల్లుణ్ణనుకొని తలా వో పొంటు పెట్టి మరీ చప్పట్లు కొట్టండి"..." కొడతా, నేను కొడతా ఈ గరిటతో ఈడ్చి కొడతా! వంటింట్లో అమ్మదగ్గర్రామీ ప్రతాపాలు! పైగా నేను చాదస్తపుదాన్లా ! మీ చదువులు సంతకెళ్ళ?

"ఏమండీ మీరయినా చెబుతారా, పప్పు కావాలో వద్దో?" ... "చెబుతా, చెబుతా... దోసకాయ పప్పన్నావు కదూ!... అహో ఏం చెప్పాడండి తైత్తరీయోపనిషత్తులో దోసని గురించి! పొలంలో నేలమీద బాగా పండిపడున్న దోసపండును ఊహించుకోమన్నాడు. ముచ్చిక నుంచి ఎవ్వరికీ చెప్పకుండా ఎప్పుడో ఆ పండు కాస్తా పుటుక్కున ఊడి ఊరుకుంటుంది గదా! అట్లాగే మానవుడు కూడా ఏ రోగమూ రొష్టు లేకుండా ఈ సంసార బంధాలనుంచి అతి చులాగ్గా టుపుక్కున విడిపోయి భగవంతునిలో కలిసిపోవాల్ట. అట్లాంటిగతికోసం మనం దేవుణ్ణి కోరుకోవాల్ట! అందుకు ఈ వయస్సునుంచే మనస్సును అదుపులో పెట్టుకోవాల్ట!... ఎంత గొప్ప ప్రార్థనో విన్నావా? ఈ సంక్రాంతి వంటి పర్వదినాల్లో అట్లాంటి మంచి ముక్కలు జ్ఞాపకం చేస్తున్నావు గదా, దోసపప్పునండి! సౌభాగ్యవతీ భవ!"

"పప్పు కావాలా వద్దా?" .. "చూడు అమ్మడూ వైరాగ్యమనేది..." ఢన్! "ఓర్నాయనో వీళ్ళంతా వలిసి నన్ను పిచ్చిదాన్నిచేసేస్తున్నారు దేవుడో ! నేనింక ఈ ఇంట్లో ఎట్లా బతికేదిరో తండ్రో! ... లేవండీ, ఏ కాశియో రామేశ్వరమో పోదాం!.. అహఁహఁ అక్కడక్కూడా మీరెందుకులెండి!... వెధవపీడ, అందరూ నాకు జ్ఞానబోధ చేసే వాళ్ళే! వాళ్ల పిచ్చి నా కెక్కించే వాళ్లే! చదువులు ముదిర్తే పిచ్చే కాబోలు! నేనెక్కడ భరించగలనమ్మో ఈ సామూహిక వీరపిచ్చి!... ఛీ. ఛీ, ... ఇదిగో ఈ గిన్నె ఇక్కడ పారేసా, నేన్పక్కాపోతున్నా. తండ్రీ పిల్లలూ తింటారో మానారో మీ ఇష్టం!... హేఁ నవ్వోకొటి, మనిషికి... ఈ మనిషిని చూసి కదూ ఈ గాడిదలు ఆడిస్తున్నారు నన్ను!.... విత్తొహటేస్తే చెట్టొహటొస్తుందాని!..."

★ ★ ★

"ఈ ముద్దుగుడుపులూ, శాస్త్ర మీమాంసలూ, సాహిత్య చర్చలూ నలుగురు పిల్లలూ భోజనాలకి కలిసినప్పుడే గదే! పప్పుగిన్నె ముందరే పక్కన పెట్టి నువ్వుకూడా ఏవో రెండు అలంకారాలు ఉచ్చరించుంటే వాళ్ళు నోళ్ళు మూసేసేవాళ్ళు గదా!... పిల్లల స్థాయిలో వాళ్లతో కలిసిపోయి గరగరా అల్లరి చెయ్యటం, వాళ్ళ నవ్వుల్లో నవ్వు కలిపి పకపక లాడేయటం, సిల్లీ సతింగ్స్ మాట్లాడేయటం, చాలా అవసరమే వెర్రిదానా! ఇందువల్ల అపేక్షలూ పెరుగుతాయి. పిల్లల్లో ఒంటరితనం పోతుంది. జనరేషన్ గాప్ అంటారే అది తగ్గతుంది.

అట్లాంటి అవకాశాలు పిల్లలున్న దంపతులకి దేవుడిచ్చిన వరాలు! పై ఏడాది ఎవరెక్కడో! రెక్కలొచ్చి ఏ పక్షి దోవన ఆ పక్షి ఎగిరిపోయాక ఇంట్లో ఈ వాతావరణం లేకపోయిందే అని నీలో నువ్వు కుమిలిపోతావు! ఎన్నో సంక్రాంతులు సాదాసీదాగానే వెళ్ళిపోతాయి. వెనక్కి వెనక్కి జ్ఞాపకాల పొరల్లో కెళ్ళి ఆ రోజులే మధురమండీ అంటావు. ఏమిటో పిచ్చిమాలోకం!''

'' అంటే, నేనే పిచ్చిదాన్నన్న మాట!''

'' ఆహాఁహాఁ లోకం కూడా పిచ్చిదనే అంటున్నా!''

'' ఆఁ!''

(ఆంధ్ర సచిత్రవారపత్రిక 20-7-84)

★★★ ★★★ ★★★

# ఋణానందం

అమ్మయ్య, అయ్యరు దేవాలయంలో నేను కోరి వడ్డింపించుకున్న అరడజనుశ్వేత చక్రాలతోనూ, కాఫీ నామధేయంతో వర్ధిల్లే కప్పుడు తీర్థంతోనూ ఆత్మరాముణ్ణి సేవించిన విష్ణుభక్తికోటిలో ఒకణ్ణయితేనే కాని కడంటిన ప్రాణాలు కట్టెను కదిలించ లేదాయె. ఇక్కడితో అయిందా, అరువు పెట్టినందుకు అయ్యరు నేను కోరకుండానే వడ్డించిన డజను చకారపల్లా( చివాట్లు) కూడా స్వీకరించిక తప్పలేదు కదా. సరే, మెట్లు దిగానో లేదో ఈ వామను డొకడు ( ముష్టివాడు) చిల్లర లేదంటే వినడు. '' ఒరేయ్ ఈ గ్రామాల్లో మేము ఏ నాడో పెద్ద ముష్టివెధవలమై పోయాం రా! నీబోటి సన్నకారు వెధవలకి పట్నాలే బెస్టురా, మురికీ పేటలూ ముతక తిళ్లూ ముతక బట్టలతో ఉన్న ముచ్చెన గుంటలూ( ఆడవాళ్లూ) మొత్తం ముతక జీవితపు పూర్ణానుస్వారం అంతా పట్నాలకే చెల్లిందిరా. వెళ్ళరా గాడిద కొడుకా! వెళ్ళు, పట్నం వెళ్ళు నాలాంటి వాళ్లకు ఈ వూరు వదిలేయ్.''

అమ్మయ్య, ఇట్లా కాస్త ఎండ పొడన వచ్చిపడ్డానా. ఒళ్లు కాస్త వేడెక్కుతూంది. వెధవది,శీతాకాలపు చలి తొమ్మిదయినా వదల్లేదు. అన్నట్లు జేబులో ఒక పాసింగ్ షో ఉన్నదేమో... అబ్బేలేదు. పోనీ ఎవణ్ణయినా ఒక ఫైవ్ అప్పడిగితే, అర్ధణాకోసం అయిదు రూపాయలు అప్పడిగే బదులు ఇట్లాగే కదూ మనం ఘరానా లప్పు(రావయింది) అప్పారువుకే అప్పుగా సిగరెట్లగిడితే పోలా? అప్పు(రావులు అప్పు లడక్కపోతే అప్పిచ్చే అప్పారావులు అప్పులెవరి కిస్తారు? ఆల్రైట్, పద... '' అప్పారావ్ ఒక పాసింగ్ షో పెట్టందు కోవోయ్'' ఏమిటి ఇప్పటికే పాతిక రూపాయలు అప్పయిందంటున్నావా అ్వవనీవోయ్ నువ్వెక్కిడికి పోతావ్, అప్పిచ్చేసే గుణం ఎక్కడికి పోతుంది. ఏమిటి నేను పోతే ప్రమాదమంటావా బాగుబాగు.నీ నా సంబంధం ఇవ్వాల్టితో పోయేది కాదోయ్ సమాజాన్ని పరిపూర్ణంగా సేవించిన అనంతర ఘడియల్లోకూడా నీ దగ్గర ఒక్క సిగరెట్టయినా స్వీకరించకుండా నా శవం సుఖంగా సప్త కట్ల సవారిని స్వారీ చేసేనా? స్వారీ చేసినా దాన్ని స్మశానంలో సహస్రజిహ్వుడు సాదరంగా స్వీకరించేనా ఒట్టి మాట. నీకు నేనూ నాకు నువ్వూ, నువ్వులూ బెల్లంలాటివాళ్లం రాబోయే అనంత తరాలకు ఆదర్శ పురుషులం... కబుర్లు కట్టేసి డబ్బెప్పుడిస్తానో చెప్పమంటావా? నిప్పుమీది ఉప్పు లాగా చిటపటలాడకోయ్ మా బామ్మర్దొకడు మనకో రెండు పుంజీల వేలివ్వాలి అదీ అట్లా రాగానే నీ కిట్టా సర్దేయ్యనూ! ( ఔరా, నాలికా రాజమా, బామ్మర్దిని నువ్వు అప్పడిగావా, అతగాడు నీకు ఇస్తానన్నాడా? ఏది సత్యం) సరే వస్తా, అవతల మన కోసం పెద్ద